మరో ప్రజా సంకల్పం

Maro Praja Sankalpam • Main Edition

స్థానిక ఎన్నికల్లో వైయస్ఆర్‌సీపీ అభ్యర్థులను ఓడించేందుకు చంద్రబాబు కుట్రలు

■ వైయస్ఆర్‌సీపీ అధికార ప్రతినిధి పుత్తా శివశంకర్ ధ్వజం

తాడేపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల్లో వైయస్ఆర్‌సీపీని రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యం లేక కూటమి ప్రభుత్వం అడ్డదారులు తొక్కుతోందని పార్టీ అధికార ప్రతినిధి పుత్తా శివశంకర్ విమర్శించారు. వైయస్ఆర్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, బలమైన అభ్యర్థులను పోటీకి దూరం చేసేందుకు అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. కుల ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం, గతంలో జారీ చేసిన ధ్రువపత్రాలపై వివాదాలు, పోలీసుల ద్వారా బెదిరింపులు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు. విశాఖపట్నానికి చెందిన వెంకట నాగశశికళ, వెంకట సత్యల కుల ధ్రువీకరణ పత్రాలకు సంబంధించి వివాదాలు తలెత్తడంపై పుత్తా శివశంకర్ ప్రశ్నలు లేవనెత్తారు. గతంలో జారీ చేసిన ధ్రువీకరణ పత్రాలు, అఫిడవిట్లు, అధికారిక రికార్డులను పరిశీలించి చట్టప్రకారం నిర్ణయం



తీసుకోవాలని సూచించారు. మార్కాపురంలో వైయస్ఆర్‌సీపీ అభ్యర్థి ఈ నెల 6న సమర్పించిన కుల ధ్రువీకరణ పత్రం దరఖాస్తుపై ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. దరఖాస్తుల పెండింగ్‌కు కారణాలను అధికారులు వెల్లడించాలని కోరారు.

అధికారులు నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలి

ప్రభుత్వ ఉద్యోగులు ఏ రాజకీయ పార్టీకి అనుకూలంగా కాకుండా చట్టప్రకారం పనిచేయాలని పుత్తా శివశంకర్ అన్నారు. కుల, నివాస ధ్రువీకరణ పత్రాలను నిర్దిష్ట విధానాల ప్రకారం జారీ చేయాలని, అనవసర అభ్యంతరాలతో అభ్యర్థులను కార్యాలయాల చుట్టూ తిప్పకూడదని పేర్కొన్నారు. అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించకపోతే ఎన్నికల సంఘం, జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులకు ఆధారాలతో ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడకముందే వైయస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై బైండోవర్ చర్యలు చేపట్టడంపై పుత్తా శివశంకర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడాన్ని ఎవరూ వ్యతిరేకించరని, రాజకీయ కారణాలతో ప్రతిపక్ష నాయకులను లక్ష్యంగా చేసుకోవడం సరికాదని అన్నారు. పోలీసులు రాజకీయ ఒత్తిళ్లకు అతీతంగా పనిచేసి, ఎన్నికల్లో ప్రతి ఒక్కరికీ సమాన రక్షణ కల్పించాలని కోరారు.

Main Edition
14 Oct 2026 Page No. 4